క్లుప్తంగా

పీహెచ్‌సీని సందర్శించిన జెడ్పీ సీఈఓ

కామేపల్లి: కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ వినోద్ మంగళవారం సందర్శించారు. పీహెచ్‌సీని జెడ్పీ నిధులతో ఇటీవల మరమ్మతులు చేపట్టగా పూర్తయిన పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్.చందన, హెచ్ఈఓ దూప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ స్థలంలో నిబంధనలు పాటించాలి

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ భీమేశ్వరస్వామి దేవాలయానికి చెందిన స్థలంలో చికెన్, మద్యం దుకాణాలు నిర్వహిస్తే సహించేది లేదని దేవాదాయ శాఖ ఈఓ కె.శ్రీకాంత్ హెచ్చరించారు. ఇటీవల స్థలం బహిరంగ వేలంలో లీజ్‌కు తీసుకున్న వ్యక్తులు చికెన్ దుకాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారని, పరిసర ప్రాంతంలో నివాసం ఉండే వారు దేవాలయం ఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈఓ స్పందిస్తూ..నిబంధనలకు వ్యతిరేకంగా చికెన్, మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే టెండర్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు బ్యాగ్‌లు, నోట్ బుక్స్ పంపిణీ



బ్యాగ్‌లు, నోట్ బుక్స్ అందుకున్న విద్యార్థులతో ట్రస్ట్ చైర్మన్, తదితరులు

తిరుమలాయపాలెం: మండలంలోని పాతర్లపాడు, గోల్‌తండా, జింకలగూడెం, గోపాయిగూడెం గ్రామాల్లో హజరత్ సయ్యద్ మదర్ సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యార్థులకు మంగళవారం బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కాగా, వీటిని ట్రస్టు చైర్మన్ సయ్యద్ ఇమామ్ ఆధ్వర్యాన 116 మంది విద్యార్థులకు సుమారు 92,800 విలువైన స్కూల్ బ్యాగ్‌లతో పాటు నోట్ బుక్స్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సయ్యద్ సైదా, వీర రెడ్డి, నర్సయ్య గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కరెంట్ కోత

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33/11 కేవీ గాంధీచౌక్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న 11 కేవీ గుట్టల బజార్ ఫీడర్ నిర్వహణ పనులు, రైల్వే మూడవ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా బుధవారం ఉదయం 9:30 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 సెక్షన్ ఏఈ ఆపరేషన్స్ మౌలిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మోహన్ రోడ్, వాసవీనగర్, జహీర్‌పుర తండా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నాణ్యమైన సేవలు అందించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు కోరారు. మంగళవారం త్రీటౌన్ మార్కెట్ రోడ్‌లో నూతనంగా ఉపేందర్ టింబర్ ట్రేడర్స్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దడాల రఘు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు భాస్కర్, వెంకటేశ్వర్లు, బ్రహ్మం, శ్రీనివాస్, వెంకటాచారి, నర్సింహారావు, కాళంగి దేవదానం, గోపి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్: నీట్ స్కామ్‌పై సమగ్ర విచారణ జరిపించాలని, నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రైవేట్, కార్పొరేట్ ఫీజులను నియంత్రించాలని, నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలో ఈ నెల 4న చేపట్టిన దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో జరిగిన విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు టి.ప్రవీణ్‌కుమార్, ఇటికాల రామకృష్ణ, వి.వెంకటేష్, జి.మస్తాన్, ఆసిఫ్, బషీరుద్దిన్, ఏఐవైఎఫ్, పీవైఎల్ నాయకులు శ్రావణ్, మంద సురేష్‌లు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు చింతల రమేష్, సుధాకర్, లక్ష్మణ్, సాయి, వినోద్, సిద్ధార్థ, మాలిక్ పాషా, శ్రీను, పాండు, మల్సూర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	కల్కి
సాయిరాం	కల్కి
ఆదిత్య	కల్కి, మహారాజ
శ్రీనివాస	కల్కి

- ఖమ్మంగాంధీచౌక్



షెడ్డు నిర్మాణానికి వేసిన స్తంభాలు



కొనసాగుతున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులు



వెయిటింగ్ హాల్ భవనం

ఆధునికీకరణ.. ఆలస్యం

ఖమ్మం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులపై కమ్ముకున్న నీలినీడలు

- రూ. 25 కోట్ల నిధులు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- నిధుల కేటాయింపు, పనులపై పర్యవేక్షణ కరువు
- ఏడాదిగా నత్తనడకన సాగుతున్న పనులు
- అయినా పట్టించుకోని అధికారులు



ప్రొక్లెయిన్‌తో మట్టి తవ్వుతున్న దృశ్యం

ఖమ్మం రాపర్తినగర్: ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునీకరణకు కేటాయించిన రూ.25 కోట్ల నిధుల్లో ఏ పనికి ఎంత ఖర్చు చేస్తున్నారనే అంశంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఏడాది క్రితం రైల్వే శాఖ ఖమ్మం స్టేషన్‌ను అమృత్ భారత్ పథకం కింద ఎంపిక చేసి నిధులు కేటాయించింది. అయితే, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. అంతేకాక నిధుల విషయమై ప్రశ్నించగా.. అన్ని విషయాలు కాంట్రాక్టర్‌కే తెలుసునని, తమకు ఎలాంటి సంబంధం లేదని అక్కడ విధులు నిర్వహిస్తున్న కొందరు సిబ్బంది చెబుతుండడం గమనార్హం.

నత్తనడకన సాగుతున్న పనులు..

ఖమ్మం రైల్వేస్టేషన్‌ను అన్నిరంగాల్లో సుందరీకరించనున్నట్లు అధికారులు చెబుతున్నా.. పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తన ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాది క్రితం పనులు మొదలైనా ఓ అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అప్పుడప్పుడు పని ప్రదేశాల్లో కనిపించే అధికారులను ఆరా తీసినా పనులు చేయించేది ఎవరో కూడా తెలియదని చెబుతుండడం గమనార్హం. దీంతో ఆధునీకరణ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. కాగా, ఇటీవల సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఖమ్మం సందర్శించినప్పుడు పనులు వేగంగా జరగడం లేదని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన బాధ్యులతోనూ చర్చించినట్లు తెలిసింది. ఫలితంగా అధికారి తనిఖీల తర్వాత పనుల్లో వేగం పెరిగిందని చెబుతున్నారు.

ఏ పనికి ఎంతెంత?

రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు కేటాయించిన రూ.25 కోట్ల నిధుల కేటాయింపుపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్టేషన్‌లో చేపడుతున్న పనుల్లో ఏ పనికి ఎంత నిధుల కేటాయించారనే అంశంపై గోప్యత కొనసాగుతోంది. స్టేషన్‌లో కొత్తగా షెడ్ల నిర్మాణం, ఎస్కలేటర్ ఏర్పాటు, పలు నూతన భవనాలను నిర్మిస్తుండగా.. ఇందులో దేనికి ఎంత ఖర్చు చేస్తున్నామనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

చేపడుతున్న పనులివే..

- రైల్వే స్టేషన్‌లో బుకింగ్ కౌంటర్, పార్సిల్ ఆఫీస్, మీటింగ్ హాల్, ప్రయాణికులు వేచి ఉండే ఏసీ గదులు, నాన్ ఏసీ గదులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కార్యాలయ నిర్మాణాలు.
- రైల్వే క్వార్టర్ల పరిసరాలతో పాటు స్టేషన్ ఆవరణలో డ్రెయినేజీ నిర్మాణం.
- ఒకటో నంబర్ ప్లాట్ ఫాం నుంచి రెండో నంబర్ ప్లాట్‌ఫాంపైకి వెళ్లేలా రెండో ఎస్కలేటర్ ఏర్పాటు
- ఇరువైపులా ప్లాట్‌ఫాంలపై మరింత నిడివితో షెడ్ల నిర్మాణం.

అలంకారప్రాయంగా ఎస్కలేటర్..

రైల్వే స్టేషన్‌లో ఇరువైపుల ఫ్లాట్ ఫాంలపై ఏర్పాటు చేసిన ఎస్కలేటర్లు గత కొంతకాలంగా పని చేయడం లేదు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఫ్లాట్ ఫాంలను దాటాల్సి వస్తుండడంతో ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఎస్కలేటర్లు పని చేయకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా వృద్ధులు, వయోజనులు, చిన్నపిల్లలు ఎక్కువగా ఇబ్బందిపడుతున్నారు. ఈక్రమంలో ఫ్లాట్ ఫాంలు మారేందుకు పాత బ్రిడ్జి, లిఫ్ట్ ద్వారానే వెళ్తున్నారు. దీనిని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



పని చేయని ఎస్కలేటర్

రోడ్ల నిర్మాణాలకు అంచనాలు రూపొందించండి



డంపింగ్‌యార్డ్‌లో రోడ్లను పరిశీలిస్తున్న మేయర్ నీరజ, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని రామన్నపేట డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం వద్ద, డంపింగ్ యార్డ్‌లో రోడ్ల నిర్మాణాలకు అంచనాలు రూపొందించి ప్రతిపాధనలు సిద్ధం చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం డంపింగ్‌యార్డ్‌ను సందర్శించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. డంపింగ్ యార్డ్, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు వెళ్లే రోడ్లు వర్షాలతో మరమ్మతులకు గురైందని, చెత్త వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాగా, రోడ్డు నిర్మించాలని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నివాసులు కలిసి విన్నవించగా.. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బయోమైనింగ్‌ను సందర్శించి అక్కడ ఉన్న వ్యర్థాలను తొలగించి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎ.సంపత్‌కుమార్, ఈఈ కృష్ణాలాల్, డీఈ మాధవి, ఏఈ నవ్యజ్యోతి, ఎన్విరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-24వార్షిక విద్యా సంవత్సరానికి గాను పలు సబ్జెక్టులను బోధించడానికి గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో తెలుగు-1, పొలిటికల్ సైన్స్-1, బిజినెస్ అనలిటిక్స్-1, బీబీఏ -1, స్టాటిస్టిక్స్ -1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ -7 పోస్టులు ఖాళీలున్నాయని, ఆసక్తి గలవారు ఈ నెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కళాశాల కార్యాలయంలో తమ ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలు అందజేయాలన్నారు. అయితే సంబంధిత సబ్జెక్టులో జనరల్ అభ్యర్థులకు 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులతో పాటు నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని, 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహించబడుతున్నారు.

'తమ్మినేని' సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం జిల్లా కామిటీ సభ్యుడు మాదినేని రమేష్ తండ్రి రామలింగయ్య మృతికి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సన్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు సంతాపం తెలిపారు. మంగళవారం ఖమ్మంలోని మాదినేని రమేష్ నివాసంలో రామలింగయ్య భౌతికకాయాన్ని సందర్శించిన వారు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, ఎం.సుబ్బారావు, మాచర్ల భారతి, వై.విక్రం, కల్యాణం వెంకటేశ్వరరావు, సీహెచ్.కోటేశ్వరరావు, బొంతు రాంబాబు, బాగం హేమంత్ రావు, రాయల నాగేశ్వరరావు, సంద్ర వెంకటవీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అంధులకు ఆహార పదార్థాల వితరణ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కరుణగిరిలో ఉన్న జ్యోతి నివాస్ అంధ, మూగ, చెవిటి బాలబాలికలకు మంగళవారం స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యాన ఆహార పదార్థాలను వితరణ చేశారు. పలువురి దాతల సహకారంతో బియ్యం, అరటి పండ్లు, బ్రెడ్, బిస్కెట్లు, చాక్లెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, దేవరశెట్టి రామారావు, మోతుకూరి భద్రయ్య, కొప్పుల కోటేశ్వరరావు, పెనుగొండ సాయికుమార్, నరిసింహారావు, వెంకటరమణ, మల్లేశం, సూరిబాబు, సంపత్, పుల్లారావు, ఖాజా, రవికుమార్‌లతో పాటు ముకుంద ట్రస్టు చైర్మన్ సీహెచ్.రాజ్యలక్ష్మి, ఆశ్రమం నిర్వాహకురాలు సిస్టర్ సోఫియా, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. మండలంలోని గొల్లగూడెంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 450 మంది బాలికలు ఉన్న ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు సరిపడా లేరన్నారు. అట్టడుగున్న వారికి నాణ్యమైన విద్యను అందించడంలో ప్రభుత్వం విఫలమైతే తమ సంఘం ఆధ్వర్యాన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మూడ్ గన్యానాయక్, బి.మోహన్, బి.నాగేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: అశ్వారావుపేట పీఎస్‌లో పనిచేస్తున్న దళిత ఎస్ఐ రాముల శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ దామళ్ల సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విధుల్లో ప్రజాదరణ పొందుతున్న ఒక ఎస్ఐపై కక్ష, కుల వేధింపులు, సాధింపు చర్యలకు పాల్పడడం బాధాకరమన్నారు. దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాలతో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గొట్టిముక్కల శ్రీనివాస్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పాలనలో పెరిగిన రైతు ఆత్మహత్యలు'

ఖమ్మంమయూరిసెంటర్: రైతు బాగుంటేనే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో మళ్లీ ఆత్మహత్యలు పెరిగాయని బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యుడు నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధిర అసెంబ్లీ నియోజకవర్గం చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆయన స్పందించారు. పొద్దుటూరు గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 276, 277లలో ఉన్న బోజడ్ల ప్రభాకర్, వీరభద్రయ్య భూమికి దగ్గరలో ఉన్న చెరువు నుంచి మట్టి తోలించుకుంటే కొందరు వ్యక్తులు కక్షపూరితంగానే రైతు పొలంలో జేసీబీలు, ప్రొక్లెయిన్లతో మట్టిని చెల్లాచెదురుగా చేయడం దారుణమని, రైతు ఎన్నిసార్లు అధికారాలకు విన్నవించుకున్నా ప్రయోజనం లేకుండాపోవడం శోచనీయమన్నారు. రైతు ప్రభాకర్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని, ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నామ డిమాండ్ చేశారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

నేలకొండపల్లి: ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతీయువకుడు రక్షణ కల్పించాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించారు. మండలంలోని బుద్ధారానికి చెందిన యువకుడు, అదే గ్రామానికి చెందిన యువతి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే, వారి పెద్దలు అంగీకరించకపోవడంతో మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయం తెలిసి యువతీ, యువకుల బంధువులు పెద్దసంఖ్యలో పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా.. ఇరువురు మేజర్ అయినందున ఎలాంటి వివాదం సృష్టించవద్దని పోలీసులు సూచించారు. అయినా వారు ససేమిరా అంటూ స్టేషన్ నుంచి కన్నీళ్లతో నిరాశగా వెనుదిరిగారు.

అస్తవ్యస్తంగా జీపీల పాలన

నేలకొండపల్లి: ప్రభుత్వం ఏడు నెలల నుంచి పంచాయతీలకు విడుదల చేయకపోతే అభివృద్ధి ఎలా జరుగుతుందని నేలకొండపల్లి సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు గండు సతీష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని, డీజిల్‌కు డబ్బులు లేక ట్రాక్టర్లు మూలనపడ్డాయని, సిబ్బందికి వేతనాలు లేక పస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం పంచాయతీలపై దృష్టి సారించి నిధులు కేటాయించడంతోపాటు తాజా మాజీ సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కామేపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పి పల్టీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పండితాపురం గ్రామానికి చెందిన ధనియాకుల నాగయ్య పొన్నేకల్ వైపు నుంచి తన ద్విచక్ర వాహనంపై బనిగండ్లపాడు వైపు వస్తున్నాడు. ఈక్రమంలో పొన్నేకల్ స్టేజీ సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగయ్యకు తీవ్రగాయాలు కాగా 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నేలకొండపల్లి: 25 వేల పోస్టులతో తెలంగాణ ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యాన వివిధ డిమాండ్ల కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రూపు-1 ప్రిలిమ్స్‌లో నిబంధనల ప్రకారం క్వాలీపై చేయాలని, గ్రూపు-2, 3 నోటిఫికేషన్‌లో అదనంగా పోస్టులు పెంచాలని, ప్రస్తుత డీఎస్సీ పరీక్ష తేదీలను వాయిదా వేసి నూతన తేదీలను ప్రకటించాలన్నారు. అన్ని నియామకాలలో మహిళా అభ్యర్థులకు 33 శాతం రిజర్వేషన్ కేటాయించడంతో పాటు పోలీస్ కానిస్టేబుల్ నియామకాలలో అభ్యర్థులకు అన్యాయం చేస్తున్న జీఓ నంబర్ 46ను వెంటనే రద్దు చేసి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సయ్యద్ మోహినుద్దీన్, బీజేవైఎం మండల నాయకులు కట్టకోల నవీన్, కందరబోయిన గోపి, గండారపు వెంకటేశ్వర్లు, దూదిపాళ్ల వినయ్, చందు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ఖమ్మంవన్‌టౌన్: సకలజనులు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ, సబ్బండ వర్గాల సామాజిక తెలంగాణ కోసం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్‌తో పాదయాత్ర చేపట్టి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేశారని పీసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పీపుల్స్‌మార్చ్ చేసి ఏడాది అవుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివాసీలు, గిరిజనుల సమస్యలు తెలుసుకుంటూ ఇందిరమ్మ రాజ్యం వస్తుందనే భరోసా కల్పిస్తూ పాదయాత్రతో భట్టి ముందుకుసాగారన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ గౌస్, ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, ఎర్రం బాలగంగాధర తిలక్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, పల్లెబోయిన చంద్రం, లక్ష్మణ్, శ్రీనివాస్, ప్రతిభారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వినోభానవోదయ కాలనీ సమస్యలు పరిష్కరించండి

ఖమ్మం మామిళ్లగూడెం: నీళ్లు, కరెంట్ లేక ఇబ్బంది పడుతున్న ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమెట్ల వినోభా నవోదయ కాలనీ ప్రజల సమస్యలు పరిష్కరించాలని గ్రామీణ పేదల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లూరికృష్ణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలు కూడా అమలుకు నోచుకోవడం లేదని, తక్షణమే కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా కమిటీ సభ్యుడు కొప్పెర వెంకన్న, గ్రామీణ పేదల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మంకిడి లింగరాజు, షేక్.అక్తరున్నిసా బేగం, దంతోజు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

బయోమెట్రిక్ పని చేయట్లే..!

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది హాజరులో పారదర్శకత కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ మిషన్లు గత నాలుగు రోజులుగా పని చేయడం లేదు. దీంతో హాజరు నమోదు కోసం కేఎంసీ కార్యాలయంలోని మొదటి అంతస్తులోని ఉద్యోగులు, సిబ్బంది కిందకు రావాల్సి వస్తోంది. కాగా, బయోమెట్రిక్ మిషన్లు ఆన్‌లో ఉన్నప్పటికీ పని చేయకపోవడంతో కార్యాలయంలో పలు విమర్శలు వస్తున్నాయి. గతంలో మిషన్లు ఆగిన గంటల వ్యవధిలోనే మరమ్మతులు చేయించేవారని, ఇప్పుడు వాటిని పట్టించుకునే వారే లేరని చర్చించుకుంటున్నారు.



- ఖమ్మంమయూరిసెంటర్

పెద్దాస్పత్రిలో సిబ్బంది కొరత లేకుండా ఉంచాలి



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ బృందం

ఖమ్మంవైద్యవిభాగం: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలనిక, 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యాన మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం మాట్లాడుతూ.. గత సీజన్‌లో ప్రజలు డెంగీ, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడడంతో ఆస్పత్రిలో బెడ్లు చాలలేదని, ఈసారి అలా కాకుండా చూడాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచడంతో పాటు ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. రోగుల తాకిడి పెరిగిన సందర్భంలో ఓపీ కౌంటర్లు పెంచాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా రాత్రిపూట చేసేలా చూడాలని, బాధితుల పట్ల గౌరవంగా మెలిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సాంబశివరెడ్డి, 3 టౌన్ ఏరియా కార్యదర్శి నూనె శశిధర్, జ్వాలా నరసింహారావు, ముజంమేల్, నిజాంపేట్ యాకూబ్ రవీందర్‌నాయక్, శేఖర్ నాయక్, వల్లపు నాగేశ్వరావు, ఎండీ రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి

ఖమ్మం లీగల్: అమల్లోకి వచ్చిన నూతన నల్ల చట్టాలను రద్దు చేయాలని పలు న్యాయవాద సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసు ఆధ్వర్యాన ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. నూతన నల్ల చట్టాలు ప్రజలు, న్యాయవాదులకు వ్యతిరేకంగా ఉన్నాయని, ఈ చట్టాల రద్దు కోసం న్యాయవాదులందరు కలసి పోరాడాలని, రిలే నిరాహారదీక్షలు, నిరసనలు చేపట్టాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కొల్లి సత్యనారాయణ, చింతనిప్పు వెంకట్, బిచ్చాల తిరుమలరావు, గొల్లపూడి రామారావు, వివిధ లీగల్ న్యాయవాదులు కె.క్రాంతి కుమార్, విప్లవ్‌కుమార్, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య విభాగం రద్దు సరికాదు

ఖమ్మంవైద్యవిభాగం: తెలంగాణ రాష్ట్ర ప్రజారోగ్య విభాగం రద్దు చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై వైద్య, ఆరోగ్య శాఖ ఖమ్మం జిల్లా జేఏసీ నాయకత్వం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలోని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్ అసోసియేషన్ భవనంలో వైద్య ఆరోగ్య శాఖలోని అన్ని ట్రేడ్ యూనియన్లు, డాక్టర్స్ అసోసియేషన్ సమావేశమైంది. 142 జీఓ అమలును దొడ్డిదారిన అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ప్రజారోగ్య విభాగం రద్దు వంటి నిర్ణయాలతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యం అందకుండా పోతుందని, ప్రజారోగ్యాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగ సంఘాలను సంప్రదించకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే ప్రత్యక్ష కార్యచరణ రూపొందించుకొని ముందుకెళ్లామని తీర్మానించారు. ఈ సమావేశంలో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బాబురత్నాకర్, డాక్టర్ సైదులు, ఉపాధ్యక్షులు డాక్టర్ బాబు, టీఎన్‌జీఓ నాయకులు జైపాల్, తాళ్లూరి శ్రీకాంత్, ఐఎన్‌టీయుసీ నాయకులు సీహెచ్ వెంకటరమణ, జాబిశెట్టి శ్రీనివాసరావు, రంగధామ, సుధాకర్, హరీష్, ఇమామ్, యునైటెడ్ మెడికల్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబు రత్నాకర్